## క్లుప్తంగా

### ఆది దంపతులను దర్శించుకున్న హోంమంత్రి

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను హోం మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న కోటి దీపోత్సవానికి విచ్చేసిన హోం మంత్రి అనితకు దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామరావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న జ్వాలాతోరణం, సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవకు హాజరయ్యారు. ఆదిదంపతులను దర్శించుకున్న హోం మంత్రికి కమిషనర్ సత్యనారాయణ, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను, పట్టువస్త్రాలను అందజేశారు.

### అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి

**పటమట(విజయవాడతూర్పు):** విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో గల 64 డివిజన్లలో బహిరంగ మల మూత్ర విసర్జన జరగడంలేదని, విజయవాడ నగర వ్యాప్తంగా మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగం చేస్తున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విజయవాడ నగర పాలక సంస్థ మూడవ సారి స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 లో వాటర్ ప్లస్ సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేస్తున్నందున ఏ వ్యక్తికి లేదా వ్యక్తులకు అభ్యంతరాలు ఉంటే ఈ ప్రకటనను జారీ చేసిన రోజు నుంచి 10 రోజులలోపు అభ్యంతరాలు తెలియపరచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయా అంశాలపై నగరవాసులకు ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే 81819 60909 నంబరుకు తెలియపరచాలని కోరారు.

### సామాజిక సేవలో భాగస్వాములు కావాలి




**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** విద్యార్థులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాలలోని ఎస్ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని అభయ ఫౌండేషన్ నిర్వహించే ఆశ్రమంలోని సభ్యులకు నిత్యావసరాలు, గృహోపకరణ వస్తువులు, దుస్తులు తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఎంబీఏ విద్యార్థులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్, విభాగాధిపతి డాక్టర్ విజయదుర్గాప్రసాద్, కోఆర్డినేటర్ జరీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

### కాలానుగుణంగా బోధనా విధానాలు మారాలి



**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** నూతన సాంకేతిక విప్లవం నేపథ్యంలో కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా బోధనా పద్ధతులలో మార్పులు తీసుకురావాలని బీటీ అండ్ బీటీ చైర్మన్ వి.శ్రీనివాసరావు అన్నారు. కేబీఎన్ కళాశాల ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'డ్రీమ్ బిగ్ – యాక్ట్ ఫాస్ట్' అంశంపై అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో అధ్యాపకుల స్థానాన్ని రోబో టీచర్లు ఆక్రమిస్తున్నాయన్నారు. కృత్రిమ మేధ ప్రాధాన్యం పెరుగుతోందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అధ్యాపకులు కూడా తమ నైపుణ్యాలను, విజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో హిందూహైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ రోడ్ నిర్మాణ పనులకు శ్రీకారం

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** గట్టు వెనుక ప్రాంతంలో 41వ డివిజన్ పరిధిలోగల దళితవాడలో అంబేడ్కర్ రోడ్ నిర్మాణ పనులకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్ శుక్రవారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. రూ.23లక్షల వ్యయంతో ఈ రోడ్డు నిర్మించనున్నారు.

### జీవన మంజూష పుస్తకావిష్కరణ

**విజయవాడ కల్చరల్:** గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాయలంలో నవ మల్లెతీగ ఆధ్వర్యంలో రచయిత్రి మంజు యనమదల రచించిన జీవన మంజూష పుస్తకాన్ని ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వర రావు శుక్రవారం ఆవిష్కరించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి మహ్మద్ ఇంతియాజ్ మాట్లాడుతూ కవులు సమాజాన్ని నిరంతరం అధ్యయనం చేయాలన్నారు. గోళ్ల నారాయణరావు, డాక్టర్ ఎం.ప్రభాకర్, శ్రీరామకవచం సాగర్ మంజు సాహిత్య జీవిత విశేషాలను వివరించారు. ఠాగూర్ గ్రంథాలయ పాలకురాలు రమాదేవి, నవమల్లెతీగ వ్యవస్థాపకుడు కలిమిశ్రీ నిర్వహించారు.

# శిథిలావస్థలో రైల్వే కాలనీ చిల్డ్రన్స్ పార్కు



వించిపేట రైల్వే కాలనీలోని చిల్డ్రన్స్ పార్కు



మొక్కలతో నిండిపోయిన పార్కు

- కనిపించని ఆహ్లాదం
- పనికిరాకుండా పోయిన ఆట పరికరాలు
- పట్టించుకోని రైల్వే అధికారులు

**రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):** సాయంత్రం సమయంలో పిల్లలతో కలసి ఆహ్లాదంగా గడిపేందుకు ఏర్పాటు చేసిన వించిపేట రైల్వే కాలనీలోని చిల్డ్రన్స్ పార్కు శిథిలావస్థకు చేరుకుంది. రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్యం, ఆహ్లాదం పంచడంతో పాటు పిల్లలకు ఆటవిడుపుగా ఉండేందుకు 2007లో వించిపేట రైల్వే కాలనీలో పచ్చదనంతో, పిల్లల ఆటపరికరాలు, కూర్చునేందుకు బెంచ్‌లతో సుందరంగా పార్కు నిర్మాణం చేశారు. దీంతో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సమయంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పిలలతో కలసి పార్కులో సేద తీరేవారు. అయితే ఈ పార్కు నిర్వహణ సరిగా లేకపోవడంతో ఏపుగా చెట్లు పెరిగిపోవడం, పిల్లల ఆటపరికరాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కనీసం కూర్చునేందుకు బల్లలు కూడా సరిగా లేని అధ్వాన స్థితిలో ఉన్నాయి.

#### నిర్వహణాలోపం కారణంగానే...

కాలనీ వాసులకు అందుబాటులో ఉండే విధంగా రైల్వే అధికారులు లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పార్కు నిర్వహణ లోపంతో ఎందుకూ పనికిరాకుండా పోయిందని కాలనీవాసులు వాపోతున్నారు. పిల్లలకు మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యం కూడా అందించే లక్ష్యంతో రైల్వే అధికారులు వించిపేట రైల్వే కాలనీలో చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేశారు. ఆ సమయంలో రకరకాల ఆట పరికరాలు, తాగునీరు, పూల చెట్లతో పార్కు ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. క్రమేణా వాటి నిర్వహణ లోపించడంతో పార్కులో పిచ్చిమొక్కలు పెరిగి, ఆట పరికరాలు తుప్పు పట్టి పనికిరాకుండా పోయాయి. దీంతో పిల్లలు కాలనీలోని రోడ్లపైనే ఆడుకోవాల్సివస్తోంది.

#### పార్కుకు మరమ్మతులు చేపట్టాలి...

కాలనీలోని పిల్లల కోసం ఏర్పాటు చేసిన పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేయడంతో పాటు పాడైపోయిన ఆట పరికరాలకు మరమ్మతులు చేపడితే పిల్లలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తల్లిదండ్రులు అంటున్నారు. ముఖ్యంగా దట్టంగా పెరిగిన మొక్కలతో పార్కులో పురుగు, పుట్ర చేరడంతో పిల్లలను అటుగా పంపించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు వాపోతున్నారు. రైల్వే అధికారులు దీనిపై దృష్టి పెట్టి పార్కుకు పునర్వైభవం తీసుకురావాల్సిందిగా కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వీఎంసీలో భగవాన్ బిర్సా ముండాకు ఘన నివాళి



బిర్సా ముండాకు నివాళులర్పిస్తున్న వీఎంసీ సిబ్బంది

**పటమట(విజయవాడతూర్పు):** గిరిజన ఉద్యమంలో దేశానికి దిక్సూచిగా ఉన్న బిర్సాముండాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, గిరిజన హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని వీఎంసీ అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం బిర్సాముండా జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బిర్సా ముండా భారతీయ అటవీ జాతుల స్వాతంత్ర్య సమరయోధుడని, జానపద నాయకుడని, ముండా జాతికి చెందిన ఆయన 19వ శతాబ్దపు చివరి రోజుల్లో, నేటి బీహార్, ఝార్ఖండ్ అటవీ ప్రాంతాల్లో, బ్రిటిషు వారిపై జరిగిన ఉద్యమానికి సారథ్యం వహించారన్నారు. 22 ఏళ్ల వయస్సులోనే ఆయన బ్రిటీషర్లపై యుద్ధం ప్రకటించారని, తద్వారా భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచి పోయారన్నారు. అతని గౌరవార్థం భారత పార్లమెంటులోని సెంట్రల్ హాల్లో చిత్రపటం ఏర్పాటు చేశారని, ఈ విధంగా సత్కరింపబడిన ఏకైక ఆటవిక జాతుల నాయకుడు బిర్సా ముండా అని తెలిపారు. బ్రిటిషు వలసవాదంపై తిరుగుబాటుగా సాగిన భారతీయ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న యోధునిగా బిర్సా ముండా పేరును అత్యంత గౌరవంతో ప్రస్తావిస్తారన్నారు. ఈ వేడుకల్లో అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ, జాస్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, మేనేజర్ ఏయూబీ శర్మ, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** 33/11 కేవీ హెడ్‌వాటర్ వర్క్స్ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో గల 11 కేవీ కుమ్మరిపాలెం ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ (విజయవాడ టౌన్) పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి కుమ్మరిపాలెం సెంటర్, కొట్టేటి కోటయ్య వీధి, నాలుగు స్తంభాల సెంటర్, గుప్తా సెంటర్, సాయిబాబా టెంపుల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## వీఎంసీ షెల్టర్ హోమ్స్ నిర్వహణపై పరిశీలన



షెల్టర్ హోంలలో వసతులను అడిగి తెలుసుకుంటున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

**పటమట(విజయవాడతూర్పు):** విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించే షెల్టర్ హోమ్స్ నిర్వహణ విధానాన్ని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం రాణిగారి తోట, హనుమాన్ పేట, గవర్నర్ పేట, చిట్టి నగర్‌లోని షెల్టర్ హోంలను పరిశీలించారు. షెల్టర్ హోమ్స్‌లో ప్రస్తుతం ఉన్న భోజన, మరుగుదొడ్లు, మెడికల్ క్యాంపులు, పడక, వసతులపై ఆరా తీశారు. షెల్టర్ హోంలో ఎంతమంది ఉంటున్నారు, ఎక్కడి నుంచి వస్తున్నారు వంటి అంశాలపై వారితో స్వయంగా మాట్లాడి, అక్కడ కనిపిస్తున్న వసతులు, వారి వివరాలు తెలుసుకున్నారు. రాణి గారి తోటలో ఉన్న షెల్టర్ హోమ్‌లో మరుగుదొడ్లు పాడైపోవడం గమనించి త్వరితగతిన మరుగుదొడ్లను యూసీడీ అనుసంధానంతో మరమ్మతులు చేయాలని, భవనానికి వెంటనే రంగులు వేయించాలని అధికారులను ఆదేశించారు. ఏ కారణం వల్ల నిరాశ్రయులయ్యారు? ఎప్పటినుంచి ఉంటున్నారు? వారికి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉన్నారా? ఇలాంటి అంశాలను యూసీడీ విభాగం వారిని తెలుసుకుని నివేదిక సమర్పించాలని ఆదేశించారు. గవర్నమెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొందడం కోసం వచ్చే ప్రజలు, వారి కుటుంబ సభ్యులకు చికిత్స పొందే వరకు కుటుంబ సభ్యులు ఉండటానికి ఆశ్రయం కల్పించే విధంగా పాత గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర నూతన షెల్టర్ హోమ్ ఏర్పాటు చేసేటట్టు చర్యలు తీసుకోమని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం వారి నేషనల్ అర్బన్ లైవ్ హెడ్ మిషన్ 2.0 పైలెట్ ప్రాజెక్టు లో భాగంగా ఇతర ప్రదేశాల నుంచి పని కోసం వచ్చి నిరాశ్రయులుగా ఉండే వర్కర్లకు లేబర్ డిపార్టుమెంట్ సమన్వయంతో సంయుక్త పరిశీలన చేసి లేబర్ చౌక్ ఏర్పాటు చేసేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌యూఎల్ఎం పైలెట్ ప్రాజెక్టు ద్వారా ఏర్పాటు చేసే షెల్టర్ హోమ్స్‌లో నిరుపేదల జీవన ఉపాధి కోసం ఒకటి సిటీ లైవ్లీహుడ్ సెంటర్లు కూడా ఏర్పాటు చేసేటట్టు చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) వెంకట నారాయణ, ఇన్‌చార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సామ్రాజ్యం, యూసీడీ సాంకేతిక నిపుణురాలు సుజాత పాల్గొన్నారు.

## కార్మికుల పక్షానే ఎన్ఎఫ్ఐఆర్

ఎన్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య

**రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):** ఏడు దశాబ్దాలకు పైగా రైల్వే కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ పనిచేస్తోందని, డిసెంబర్ 4, 5, 6 తేదీలలో జరిగే రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో రైలు ఇంజన్ గుర్తుకు ఓటు వేసి దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌ను గెలిపించాల్సిందిగా ఎన్ఎఫ్ఐఆర్ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్) జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య విజ్ఞప్తిచేశారు. శుక్రవారం విజయవాడ డివిజన్‌లో పర్యటించిన ఆయన ఓఆర్‌హెచ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్ఎఫ్ఐఆర్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌లు కార్మికుల హక్కుల సాధనలో ఎన్నో చారిత్రాత్మక విజయాలు సాధించినట్లు తెలిపారు. 1957లో రైల్వే కార్మికులకు పెన్షన్ పథకాన్ని సాధించిన ఘనత ఎన్ఎఫ్ఐఆర్, వాటి అనుబంధ సంఘాలదే అని అన్నారు. వీటితో పాటు గ్యారెంటీ పెన్షన్, ఫ్యామిలి పెన్షన్ కూడా ఓపీఎస్‌లో ఉండేవన్నారు. 2003 డిసెంబర్ 22న ప్రభుత్వ ఆర్డినెన్స్ ప్రకారం కొత్త పెన్షన్ (ఎన్‌పీఎస్) స్కీమ్ అందుబాటులోకి వచ్చిందన్నారు. దీంతో కార్మికులకు ఎంతో నష్టం జరుగుతుందని భావించి ఆ నాటి నుంచే ఎన్‌పీఎస్‌కు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేస్తుంటే.. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సంస్థ అయిన ఏఐఆర్ఎఫ్ మాత్రం (ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్) ఎన్‌పీఎస్‌కు పురుడు పోసి పెంచి పోషిస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా కనీస సదుపాయాలు, వసతులు లేని మారుమూల ప్రాంతాల్లో పని చేస్తున్న కార్మికులు సగటున రోజుకు ఇద్దరు చొప్పున మృతి చెందుతున్నారని, గడచిన రెండున్నరేళ్లలో 1,635 మంది చనిపోగా, 8,700 మంది గాయాలతో వికలాంగులయ్యారన్నారు. దీనిపై రైల్వే మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, వారి సంక్షేమం దిశగా యూపీఎస్ పథకం ప్రకటించారన్నారు. సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యదర్శి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

## ఆకట్టుకునే దేవకీ నందన వాసుదేవ



దేవకీ నందన వాసుదేవ చిత్ర హీరో హీరోయిన్‌లు అశోక్ గల్లా, మానస వారణాసి

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** ఈ నెల 22న విడుదల కానున్న దేవకీ నందన వాసుదేవ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని హీరో మహేష్‌బాబు మేనల్లుడు, ఆ చిత్ర హీరో అశోక్ గల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సభ్యులు శుక్రవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హీరో అశోక్ గల్లా మాట్లాడుతూ సెన్సేషనల్ హిట్ సాధించిన హనుమాన్ చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మ అందించిన కథతో అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న దేవకీ నందన వాసుదేవ చిత్రం ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందన్నారు. ఈ చిత్రంలో థ్రిల్లర్ అంశాలు ప్రేక్షకులకు మధురానుభూతిని కలిగిస్తాయన్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరియో అందించిన సంగీతం వినసొంపుగా ఉంటుందని, బీజీఎం సినిమాకు హైలెట్‌గా ఉంటుందన్నారు. మానస వారణాసిని హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయం చేస్తున్నామన్నారు. అనంతరం హీరోయిన్ మానస వారణాసి మాట్లాడుతూ తెలుగుదనం ఉట్టిపడేలా తన పాత్ర ఉంటుందని చెప్పారు. సమావేశంలో చిత్ర నిర్మాత బాలకృష్ణ సోమినేని కూడా పాల్గొన్నారు.

## పుస్తక పఠనం అలవరచుకోవాలి

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** బాల్యం నుంచే విద్యార్థులు పుస్తకపఠనం అలవరచుకోవాలని ఎస్‌బీఐ మెట్రో రీజినల్ మేనేజర్ ఏవీఆర్ సుబ్బారావు సూచించారు. బందరురోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో సాహిత్యం, కథలు, కవితలు, ఆరోగ్యం, జ్యోతిషం, వాస్తు, సైకాలజీకి సంబంధించిన పుస్తకాలను ప్రదర్శించారు. పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన ఆయన విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవ్వాలనుకున్న వారు తప్పనిసరిగా గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలన్నారు. పుస్తక పఠనానికి రోజులో కనీసం ఒక గంట అయినా కేటాయించాలని సూచించారు. పాఠశాల విద్యార్థులకు జూనియర్స్, సీనియర్, కళాశాల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ అధికారి కె.రమాదేవి ఎస్‌బీఐ ఆర్ఎంను ఘనంగా సత్కరించారు.

# భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి పూజలు





కార్తికపౌర్ణమి సందర్భంగా వన్‌టౌన్ పాత శివాలయంలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు ; వన్‌టౌన్ పాత శివాలయంలో ప్రత్యేకపూజలు చేస్తున్న మహిళలు

- పోటెత్తిన శివాలయాలు
- కార్తిక దీపాలతో కళకళలాడిన ఆలయ ప్రాంగణాలు
- శివుడికి అభిషేకాలు, లింగార్చనలు

**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** వన్‌టౌన్‌లోని శివాలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. పరమశివునికి అత్యంత ప్రీతికరమైన కార్తికమాసం ...అందులోనూ మహా పర్వదినమైన పౌర్ణమి రోజున శుక్రవారం కలిసి రావటంతో ముక్కంటితో పాటుగా అమ్మవారిని పూజించేందుకు భక్తులు ఆలయాలకు భారీగా తరలివచ్చారు. ప్రధానంగా శివాలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచి విశేష పూజలను నిర్వహించారు.

#### పోటెత్తిన పాత శివాలయం

జిల్లాలోనే అత్యంత పురాతనమైన ఆలయంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో స్వామి వారిని దర్శించుకునేందుకు శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచే భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లింగార్చన, విశేష ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలను అర్చకస్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలయంలోని వివిధ ఉపాలయాల్లో సైతం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ముఖ్యంగా పలువురు నగర ప్రముఖులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సాయంత్రం పెద్ద సంఖ్యలో మహిళలు కార్తిక దీపాలను వెలిగించారు. ఆలయంలో భ్రమరాంబ అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జ్వాలా తోరణం కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు.

#### కిటకిటలాడిన విజయేశ్వరస్వామి దేవస్థానం

దుర్గగుడి సమీపంలోని అర్జునుడి ప్రతిష్టగా పేర్కొనే పురాతన ఆలయం శ్రీ విజయేశ్వరస్వామి వారి దేవస్థానం సైతం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి ఆలయంలో విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి విశేష కుంకుమార్చనలను నిర్వహించారు. స్వామి వారికి సాయంత్రం విశేష అలంకారం చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో జ్వాలా తోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు.

#### ధర్మేశ్వరస్వామి వారి ఆలయంలో...

వన్‌టౌన్ సైకం వారి వీధిలో శ్రీ ధర్మేశ్వరస్వామి వారి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము మూడు గంటల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఆలయంలో కొలువై ఉన్న పార్వతి అమ్మవారు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పలు ప్రత్యేక అర్చనలను నిర్వహించారు. మహిళలు కార్తికదీపాలను వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు మురళి పర్యవేక్షించారు.

#### కాశీ విశ్వేశ్వరస్వామి సన్నిధిలో...

వించిపేట రామ్‌గోపాల్‌వీధిలోని రామ్‌గోపాల్ సత్రంలో ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉదయం నుంచి స్వామి వారికి విశేష అర్చనలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి కార్తికదీపాలను వెలిగించారు.

#### వైభవంగా రుద్ర హోమం

వన్‌టౌన్‌లోని శ్రీరామ శ్రీకన్యకాపరమేశ్వరీ శ్రీ నగరేశ్వరస్వామి వార్ల దేవస్థానం (కొత్తగుళ్లు) ప్రాంగణంలో కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం రుద్ర హోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో కొలువై ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

#### శివాలయాల్లో కార్తిక పౌర్ణమి పూజలు

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని చిట్టినగర్ పరిధిలోని శివాలయాల్లో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. చిట్టినగర్‌లోని కొత్త అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలోని శమీ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయం, కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి ఆలయంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆలయం, భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయాల్లో ఆకాశ దీపాలను వెలిగించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి విశేష దీపార్చనలు నిర్వహించగా, పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.



రామలింగేశ్వర స్వామికి విశేష అలంకరణ



భీమన వారి పేటలో చందనంతో అభిషేకం



వాగు సెంటర్‌లో మల్లికార్జున స్వామికి క్షీరాభిషేకం

### అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై వరంగల్‌కు చెందిన శ్రీకృష్ణ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ స్కూల్‌కు చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల అనంతరం కళావేదికపై డ్యాన్స్ స్కూల్‌కు చెందిన మల్లం శ్రీకీర్తి, జి.శ్యాంశ్రిత, లక్ష్య, అమిజ్ఞరెడ్డిలతో పాటు పలువురు చిన్నారులు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న కోటి దీపోత్సవానికి హాజరైన భక్తులు నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించి చిన్నారులను అభినందించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నృత్య ప్రదర్శన ఇవ్వడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని చిన్నారులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం శిష్యబృందాన్ని ఆలయ ఈవో కె.ఎస్.రామరావు, డీఈవో రత్నరాజు అభినందించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

### వైభవంగా శ్రీవారికి అభిషేకాలు

**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం స్వామి వారికి పంచామృతాభిషేకాలను నిర్వహించారు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో స్వామి వారి ఉత్సవమూర్తులకు పలు విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఫల, పుష్ప, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకారం చేశారు. స్వామి వారికి విశేష అర్చనలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకుడు పొన్నంగిపల్లి శ్రీరామచంద్ర మూర్తి నిర్వహించారు.

### సాయిబాబా మందిరంలో భక్తి శ్రద్ధలతో హోమాలు

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** కార్తిక పౌర్ణమి సందర్భంగా భవానీపురం పాత హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శుక్రవారం పలు హోమాలు నిర్వహించారు. రుత్వికులు చిట్యాల పవన్ కుమార్ శర్మ నేతృత్వంలో జరిగిన లక్ష్మీ గణపతి, నవగ్రహాలు, దత్తాత్రేయుడు, సాయిబాబా హోమాలలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం మందిరంలో దీపాలు వెలిగించి తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలను స్వీకరించారు. భక్తులు అర్ధనారీశ్వర రూపంలో ఉన్న పరమేశ్వరుని ముగ్గుతో తీర్చిదిద్ది చుట్టూ ఏర్పాటు చేసిన ప్రమిదలలో వత్తులు వెలిగించిన దృశ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.